క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

మంత్రి కాకాణి నివాళి



శేషారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి

ముత్తుకూరు : మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వేణుంబాక శేషారెడ్డి ఇటీవల మృతి చెందగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఆయనకు నివాళులర్పించారు. నెల్లూరులోని వేణుంబాక నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. శేషారెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని, స్వగ్రామమైన తాళ్లపూడికి చేసిన సేవలను బంధువులు, సన్నిహితుల వద్ద గుర్తు చేసుకున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పూజలు, ఉత్సవాలు, సేవలను విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, కొండ్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాంతమ్మ, బయ్యపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి, పద్మ, దేవరాల శ్రీనివాసులు, రాజేశ్వరి, లోకేశ్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, బి.మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

వైకుంఠనాథ అలంకారంలో రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పగల్‌పత్తు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు రంగనాథుడు వైకుంఠనాథ అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఐ.శివకుమార్ ఆచారి, మాజీ సభ్యులు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత



నెల్లూరు(దర్గామిట్ట): ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లను గురువారం నెల్లూరులో ఆవిష్కరించారు. 14 నుంచి 20వ తేది వరకు వారోత్సవాలు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వి.విజయ, బాలచంద్ర, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టంపై కేంద్రానికి సమగ్ర నివేదిక

- పంట నష్టం, కాలువల గండిపై కేంద్ర బృందం పరిశీలన



వెంకటాచలం : కనుపూరు కాలువకు పడిన గండిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

వెంకటాచలం : తుఫాన్ కారణంగా జిల్లాలో కలిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని కేంద్ర బృందం అధికారులు రాజేంద్ర రత్ను, విక్రమ్‌సింగ్ పేర్కొన్నారు. వెంకటాచలం మండలం పులితీగలపాడు సమీపంలో తుఫాన్ కారణంగా కనుపూరు కాలువకు పడిన గండిని కేంద్ర అధికారులు గురువారం పరిశీలించారు. తొలుత వారికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పలు గ్రామాల రైతులు తుఫాన్ వల్ల కలిగిన నష్టంపై అర్జీలిచ్చారు. కనుపూరు కాలువకు గండి కారణంగా పంట పొలాల్లో వరద నీరు పారి ఇసుక మేటలు ఏర్పడ్డాయని, నారుమళ్లు దెబ్బతిన్నాయని కేంద్రం బృందం అధికారులకు వెంకటశేషయ్య వివరించారు. వరి రైతులతో పాటుగా, ఉద్యాన, ఆక్వా రైతులు నష్టపోయారని, కనుపూరు కాలువ గండి మరమ్మతులకు వెంటనే నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ పంట పొలాలు, రోడ్లు, సాగునీటి కాలువలు, అక్వా కల్చర్, ఇతర అన్ని నష్టాలపై పరిశీలించి కేంద్రం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపుతామన్నారు. పరిశీలనలో భాగంగా రైతులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, వాస్తవ పరిస్థితిపై కచ్చితమైన నివేదిక పంపుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విస్తృత పర్యటన

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు, జగదేవిపేట, కొత్తూరు గ్రామాల్లో జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోలాతో కలిసి కేంద్ర బృంద సభ్యులు రాజేంద్ర రత్ను, విక్రమ్‌సింగ్ గురువారం విస్తృతంగా పర్యటించారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని బాధితులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగదేవిపేటలో విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించి జరిగిన నష్టం, ఎదురైన సమస్యలు, తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. కొత్తూరులో ఇళ్లు దెబ్బతిన్న బాధితులతో మాట్లాడారు. మొత్తంగా ఇందుకూరుపేట మండలంలో జరిగిన పంట నష్టంపై వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు కేంద్ర బృంద సభ్యులకు ఫొటోలతో సహా పూర్తిస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎంఐపీ పీడీ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, తహసీల్దార్ సుబ్బయ్య, విద్యుత్‌శాఖ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్, గృహ నిర్మాణశాఖ ఏఈ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమం సందర్శన

మహాత్ముని స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. రుస్తుంజీ భవనంలో కొద్దిసేపు ధ్యానం చేశారు. తొలుత ఆశ్రమంలోని గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ కో-కన్వీనర్ రవీంద్రరెడ్డి ఉన్నారు.

కోవూరు పరిధిలో..

కోవూరు : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో కేంద్ర బృంద సభ్యుడు విక్రమ్‌సింగ్, తదితరులు మండలంలోని ఇనమడుగు, లేగుంటపాడు, చెర్లోపాళెం గ్రామాల్లో తుఫాన్ నష్టాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న తమలపాకు, అరటి తోటలను నిశితంగా పరిశీలించి నష్ట వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర ఇనమడుగు గ్రామంలో తమలపాకు రైతు సురేంద్రరెడ్డితో మాట్లాడారు. ఎంత విస్తీర్ణంలో తమలపాకు సాగు చేస్తున్నారు.. ఎంత ఖర్చయింది.. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితా మేరకు పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ ఎస్.సుబ్బారెడ్డి, ఆర్డీఓ మలోలా, మండల ఏఓ ఇందిరావతి, ఉద్యాన శాఖ ఏఓ విశాల్, రైతు నేతలు మీరారెడ్డి, పొన్నవోలు సుధీర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.



ఇందుకూరుపేట : కొత్తూరులో ఇంటిని కోల్పోయిన బాధితురాలితో మట్లాడుతున్న అధికారులు

ప్రజా శ్రేయస్సే లక్ష్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా శ్రేయస్సే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శ్రీహరి అనే వ్యక్తి వెంకటాచలం మండలం నిడిగుంటపాళెంలో విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తుంటాడు. విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తుండగా అతను తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. అతను చికిత్స చేయించుకున్నాడు. కాగా స్పందించిన మంత్రి వైద్యానికి ఖర్చు అయిన మొత్తం రూ.16,59,461ను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. చెక్కును గురువారం నెల్లూరులో శ్రీహరికి కాకాణి అందజేశారు. కార్యక్రమంలో ఈఈ జయకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి

శాస్త్రోక్తంగా ఆలయ జీర్ణోద్ధరణ

విడవలూరు: మండల కేంద్రం విడవలూరులోని కామాక్షినగర్‌లో వెలసిన భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేక మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, స్వామిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోవూరు : విజయనగరం జిల్లాలోని రాజీవ్ స్టేడియంలో ఈనెల 11న జరిగిన అండర్-17, 19 రాష్ట్ర స్థాయి పోటీల్లో కోవూరు పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎ.జగతీసింగ్ 64 కేజీ విభాగంలో ఫైనల్స్‌కు చేరింది. ఇందులో విశాఖపట్నం, నెల్లూరు జట్లు తలపడగా.. విశాఖకు చెందిన దీపిక బంగారు పతకాన్ని సాధించగా, జగతీసింగ్ వెండి పతకాన్ని కై వసం చేసుకుంది. అదేవిధంగా ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.హర్షిణి వెండి పతకం సాధించగా షేక్.ముత్తహర్, జి.మాళవిక, సల్మా, వి.సోనీ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వేదికను హెచ్‌ఎం నరసింహమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.



బాక్సింగ్‌లో రన్నర్‌గా నిలిచిన జగతీసింగ్

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కోవూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ-2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామంలో గుంటకట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన తయారీ సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఏజెన్సీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



జగనన్న గోరుముద్ద తింటున్న ఎంఈఓ-2 చెంచులక్ష్మమ్మ

రాబోయేది జగనన్న ప్రభుత్వమే

మనుబోలు : 2024లో రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ రఘురాజు ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మరోసారి సీఎం కావాలని వెంకటేశ్వరుని ఆశీస్సులు కోరుతూ విజయనగరం జిల్లా బొడ్డవల గ్రామం నుంచి ప్రారంభించిన పాదయాత్ర బుధవారం రాత్రి మనుబోలుకు చేరుకుంది. మనుబోలులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో రాత్రి బసచేసిన ఆయన గురువారం ఉదయం మళ్లీ పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 820 కిలోమీటర్ల పాదయాత్ర చేసి తిరుమల చేరుకోనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, గిరి తదితరులు కొంత దూరం కలిసి నడిచారు.



రఘురాజుతో కలిసి నడుస్తున్న పార్టీ నేతలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామం వద్ద మెయిన్ రోడ్డు పక్కన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సాయం అందజేత



పొదలకూరు : కల్యాణపురంలో సరుకులు అందజేస్తున్న నాయకులు



పొదలకూరు : ముదిగేడులో సరుకుల పంపిణీ

పొదలకూరు : మండలంలోని కల్యాణపురం గ్రామానికి చెందిన తుఫాన్ బాధితులకు గురువారం ప్రభుత్వ సాయం అందజేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న ప్రతి గిరిజన కుటుంబానికి 25 కిలోల బియ్యం, పామాయిల్ ప్యాకెట్, కిలో కందిపప్పు, కిలో ఉల్లిగడ్డలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో రామయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు వెన్నపూస దయాకర్‌రెడ్డి, అక్కెం బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగేడులో..

మండలంలోని ముదిగేడు గ్రామంలో తుఫాన్ బాధితులకు సరుకులను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. వీఆర్వో శంకరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, పార్టీ నేత మాలపాటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : ఎల్ఎస్‌పురం గ్రామంలో..

ఎల్ఎస్‌పురంలో..

మనుబోలు : మండలంలోని ఎల్ఎస్‌పురం గ్రామంలో ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ప్రభుత్వ సాయాన్ని అధికారులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. మండలంలో 1,950 కుటుంబాలకు సరుకులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

చిరుత కోసం గాలింపు

- ఎలాంటి జాడ లేదని అధికారుల నిర్ధారణ



కాటేపల్లి అటవీ ప్రాంతంలో గాలిస్తున్న అటవీ శాఖాధికారి

తోటపల్లిగూడూరు : మండలంలో కాటేపల్లి తీరంలో చిరుతపులి జాడ కోసం అటవీశాఖాధికారులు గురువారం గాలింపు చర్యలు చేపట్టారు. కాటేపల్లి శివాలయంలో కార్తీకమాస పూజల కోసం వచ్చిన కొందరు భక్తులకు చిరుత కనిపించిందనే పుకార్లు రావడంతో ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు అటవీ శాఖ సెక్షన్ అధికారి బాలకృష్ణ శుక్రవారం కాటేపల్లి తీరప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అటవీ ప్రాంతంలో, నీటి గుంతల వద్ద చిరుత అడుగుజాడల గుర్తుల కోసం అన్వేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల అనుమానాల నేపథ్యంలో గాలింపు చర్యలు చేపట్టామని, అయితే పిల్లి అడుగు గుర్తులు మినహా ఎక్కడా పులి అడుగు గుర్తులు కనిపించలేదన్నారు. అయినప్పటికీ భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

స్కోర్ నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని సచివాలయాల డిజిటల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలకు సంబంధించి ఆన్‌లైన్ స్కోర్ నమోదుపై ఎంపీడీఓ శ్రీహరి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనిని విజయవంతం చేసేలా సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే మండలంలో ఎంపిక చేసిన 8 క్రీడా మైదానాల్లో పోటీలు జరుగుతాయన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ఈ ఆటకు సంబంధించిన ఆన్‌లైన్‌లో స్కోర్ నమోదు చేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న ఆశీర్వాదం



విడవలూరు : మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన చిన్నకాపు తానం గారి రమణయ్య కుమారుడు సతీష్, ఉషా వివాహం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా వావిళ్ల గ్రామానికి చెందిన అలగనాథ స్వామి ఆలయ చైర్మన్ గ్రంధి హరి కుమార్తె సుహారిక, సాయికృష్ణ వివాహానికి ఎమ్మెల్యే ప్రసన్న వెళ్లి ఆశీర్వదించారు.

పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

కొడవలూరు : పాఠశాలల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో సమగ్రంగా పొందుపరచాలని ఎంఈఓ జి.వసంతకుమారి సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో యూ డైస్ ప్లస్ 2023-24 పై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న మౌలిక వసతులు, కావల్సిన వసతులు, విద్యార్థుల నమోదు, సామర్థ్యాలు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా పొందుపరచాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. ఎంఈఓ-2 ఎస్.అంకయ్య మాట్లాడుతూ యూ డైస్ వివరాలకు అనుగుణంగా నిధులు మంజూరు జరుగుతున్నందున ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో యల్లాయపాళెం హైస్కూల్ హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య, సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, పెంచలరావు, లీలయ్య, రమేష్, సురేష్, శ్రీహరి, వీరాంజనేయు పాల్గొన్నారు.



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంఈఓలు

రూ.14.62 కోట్లతో తాగునీటి వసతి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు

మనుబోలు : మండలంలోని వివిధ గ్రామాలకు రూ.14.62 కోట్లతో తాగునీటి వసతి కల్పించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఆయన గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురివిందపూడి గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకును రూ.39.20 లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ ట్యాంకు నుంచి సమీపంలో ఉన్న అనుపల్లిపాడు గ్రామానికి రూ.25.70 లక్షలతో పైపులైన్ నిర్మాణం చేపట్టి దాని ద్వారా గ్రామానికి కూడా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బిరదవోలు గ్రామ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకుంటే వెంటనే వలంటీర్ల ద్వారా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ బాలకృష్ణయ్య, సర్పంచ్ బడుగు వెంకటరమణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, పార్టీ నేతలు వెన్నపూస దయాకర్‌రెడ్డి, అక్కెం బుజ్జిరెడ్డి, ఎన్.గోపాలయ్య, రావుల ఇంద్రసేనాగౌడ్, బడుగు శ్రీనివాసులు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులందరికీ ఉచిత పశుదాణా

తోటపల్లిగూడూరు : మిచాంగ్ తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడిన పాడి రైతులందరికీ ఉచితంగా పశుదాణాను పంపిణీ చేస్తున్నట్లు ఇందుకూరుపేట పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ఈదూరు, వరకవిపూడి, అనంతపురం గ్రామాలకు చెందిన 300 మంది రైతులకు గురువారం బస్తా చొప్పున ఉచిత పశుదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మురళీకృష్ణ మాట్లాడుతూ విపత్తుల సమయంలో పాడి రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశుదాణా(టీఎంఆర్)ను అందించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, స్థానిక ఎంపీటీసీ సరస్వతి, ఈదూరు పశు వైద్యశాల వైద్యుడు ప్రవీణ్, ఏహెచ్‌ఏ సయ్యాద్ నియాజ్, నాగరాజు పాల్గొన్నారు.



ఉచిత పశుదాణాను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు